క్లుప్తంగా

ప్రహరీ నిర్మించాలి



మల్దకల్: మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్ ప్రహరీ కొంతమేర కూలింది. దీంతో మూగజీవాలు, విషపురుగులు ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం తాగి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నూతనంగా ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా పోలమ్మ దేవర



ధరూరు: మండలంలోని నర్సన్‌దొడ్డిలో బుధవారం పోలమ్మ దేవర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. గ్రామంలో పండుగ సందడి నెలకొంది. నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ్లళ్ల రంజిత్ కుమార్ హాజరై గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో ఒంటలపేట కాలనీలోని వర్షాలతో కూలిన ఇళ్లను ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నాబాషా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటలపేటలో నాలుగు ఇళ్లు కూలాయని బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పాత ఇళ్లను గుర్తించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఐఎం నాయకులు తదితరులు ఉన్నారు.

బీసీ హాస్టల్‌లో కూలిన పైకప్పు



గద్వాల రూరల్: జిల్లా కేంద్రంలో బీసీ వసతి గృహంలో పైకప్పు ఊడిపడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు బుధవారం హాస్టల్‌ను సందర్శించారు. రెండు రోజుల కిందట పైకప్పు ఊడిన సమయంలో హాస్టల్‌లో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి

అలంపూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు రాములు ఎమ్మెల్సీని కోరారు. బుధవారం హైదరాబాదులోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి పరామర్శ

గట్టు: మాచర్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడి మహ్మద్‌అలీ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాదులోని గచ్చిబౌలి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం బాధితుడిని మంత్రి హరీష్‌రావు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు మంత్రి సూచించారు.

ఎస్‌ఐ ఉదారత

కేటీదొడ్డి: మండలంలోని ఉమ్మిత్యాల స్టేజీ వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని గమనించి ఎస్‌ఐ వెంకటేష్ సొంత ఖర్చులతో మట్టి వేయించి ఉదారత్వం చాటుకున్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ జిక్కిబాబు, పోలీసులు రజిని, గోపిలు దగ్గరుండి పనులు చేయించారు.



రోడ్లు ఇలా.. వెళ్లేదెలా?



మానవపాడు రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన వర్షపునీరు



జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో...

గద్వాల అర్బన్/మానవపాడు: ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు ఛిద్రమయ్యాయి. రహదారులు ధ్వంసం కావడంతో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గద్వాల ప్రధాన కూడళ్లలోని రోడ్లు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని కృష్ణవేణి చౌరస్తా, చేపల మార్కెట్, అంబేడ్కర్ చౌరస్తా, రెండో రైల్వేగేటు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, జిల్లా ప్రభుత్వాసుపత్రి పక్కన రోడ్డు, దాన ఫ్యాక్టరీ సమీపంలో, తదితర రహదారులు అడుగుకో గుంత అన్న చందంగా మారాయి. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ కుంటను తలపిస్తోంది. మానవపాడు, నారాయణపురం అండర్ రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు భారీగా నిలిచింది. రాకపోకలకు వీలు లేకుండా పోయింది. మానవపాడు నుంచి చెన్నిపాడు మీదుగా పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గుండా అలంపూర్ చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది.



గద్వాల ఆర్టీసీ బస్టాండులో ..

హరితహారం మొక్కలను సంరక్షించాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తిక్కన్న



అమరవాయిలో పాదులు తీస్తున్న కూలీలు

మల్దకల్: హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను నాటి సంరక్షించాలని ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామ సమీపంలో రోడ్లకు పక్కన నాటిన హరితహారం మొక్కలను వారు పరిశీలించి మాట్లాడారు. మొక్కల చుట్టూ పాదులు తవ్వి వాటికి ట్రీగార్డులను ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీలలో వచ్చే హరితహారం నాటికి మొక్కలను పెంచాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు ఉమేరా, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ రఘుపతి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

కేటీదొడ్డి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా మండలంలోని సోంపురంలో సర్పంచ్ తిక్కన ఆధ్వర్యంలో ఇంటింటికి ఆరు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లుంటేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



కోరుకొండ గట్టు వద్ద ఒరిగిన స్తంభం



అయిజలో వంతెనపై తెగిపడిన విద్యుత్ వైర్లు

ధరూరు: అసలే వర్షాకాలం.. ఆపై వీస్తున్న భారీ గాలులకు కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని జాంపల్లిలో ఇళ్ల మధ్య ఉన్న ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. పక్కనే ఉన్న నివాస గృహాల వారు కొత్త స్తంభం ఏర్పాటు చేసుకున్నా దీనికి విద్యుత్ లైన్ అమర్చడం లేదు. అలాగే మన్నాపురం-జూరాల వెళ్లే దారిలో కోరుకొండయ్య గట్టు సమీపంలో రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో అటువైపు గుండా వెళ్లే ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు.

ఉండవెల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని శివారులో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. అదేవిధంగా మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు.

తృటిలో తప్పిన ప్రమాదం

అయిజ: పట్టణంలోని ఉప్పలదొడ్డి పేట సమీపంలో బుధవారం విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగింది. పక్కన ఉన్న వంతెనపై విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



ఉండవెల్లి శివారులో విరిగిన విద్యుత్ స్తంభం



ఉండవెల్లిలో మరమ్మతు..

రూ.50 వేల విరాళం

గట్టు: కేటీదొడ్డి మండలం చింతలకుంటలో వాల్మీకి గుడి నిర్మాణానికి సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బల్గెర హనుమంతునాయుడు రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. బుధవారం బల్గెరలో హనుమంతునాయుడిని వాల్మీకి గుడి కమిటీ సభ్యులు కలిసి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఆయన స్పందించి రూ.50 వేలు అందజేశారు. అనంతరం దాతను వాల్మీకి సంఘం నాయకులు సన్మానించారు.



విరాళం అందజేస్తున్న హనుమంతునాయుడు

మద్యం పట్టివేత

కేటీదొడ్డి: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని బుధవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు ఎరమొర్సు గ్రామానికి చెందిన శివప్ప అక్రమంగా మద్యం తరలిస్తున్నాడు. పోలీసులు తనిఖీ చేయగా రెండు ఇంపీరియల్ బ్లూ, ఒకటి విస్కి, రెండ కింగ్ ఫిషర్ బీర్లు, ఒక బ్యాగ్ పేపర్ మద్యం బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మహ్మద్ తెలిపారు.

పేదలకు ఇళ్లు నిర్మించాలి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని సర్వే నంబర్ 34 భూమిలో పేదలకు కేటాయించిన స్థలంలో వారు ఇళ్లు నిర్మించుకునేందుకు సహకరించాలని ఎంపీటీసీ ఎల్లస్వామి, బీఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు బుధవారం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 34లో 3.20 గుంటల భూమిని ప్రైవేటు వ్యక్తుల నుంచి ప్రభుత్వం 1984లో కొనుగోలు చేసి, గ్రామానికి చెందిన పేద దళితులకు ఇళ్లు కట్టుకోవడానికి ప్లాట్లు కేటాయించారు. అప్పట్లో కొంతమంది గృహాలు, గుడిసెలు నిర్మించుకున్నారు. కొన్ని ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న పాట్లలో ఇళ్లు నిర్మించుకోవడానికి వెళ్తే, భూమి తమదని కొందరు వ్యక్తులు వారికి ఆటంకాలు కలిగిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆ భూమిని అప్పట్లో ప్రభుత్వం కొనుగోలు చేసి, రెవెన్యూ రికార్డులో భూయజమాని పేరు తొలగించలేదని ఆయన వివరించారు. రెవెన్యూ శాఖ పరంగా జరిగిన తప్పిదాన్ని గ్రహించిన రాష్ట్ర అధ్యక్షుడు ఈ విషయాన్ని ప్రభుతం దృష్టికి తీసుకెళ్లి దళితులకు న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. అధైర్య పడొద్దని అన్నివిధాలా అండగా ఉంటామన్నారు.

గడియారం రామకృష్ణ శర్మ నివాళి



జోగుళాంబశక్తిపీఠం: అలంపూర్‌లో సాహితీ అకాడమీ గ్రహీత గడియారం రామకృష్ణ శర్మ 17 వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు, గురుదేవ్ పాఠశాల కరస్పాండెంట్ నందు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామయ్య శెట్టి, ఆలయ అర్చకులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆలయాలకు చెందిన దాదాపు 400 ఎకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడారని గుర్తు చేశారు.

ఆలిండియా టాపర్‌కు సన్మానం

అలంపూర్ రూరల్: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన బోయ మద్దిలేటి కుమారుడు బోయ రామకృష్ణ యూజీసీ నెట్ ఫలితాల్లో ఆలిండియా టాపర్‌గా నిలిచాడు. దీంతో గ్రామస్తులు తలారి వెంకటస్వామి, కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, నర్సింహనాయుడు బుధవారం టాపర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. తెలుగు భాష సాహిత్య విభాగంలో 194 మార్కులు సాధించినట్లు టాపర్ తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి



అయిజ: ప్రభుత్వం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తపస్ జిల్లా శాఖ సభ్యుడు భీమేశ్వర్‌రెడ్డి కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ప్రజా ప్రతినిధులకు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశామని గుర్తు చేశారు. జగదీష్, పరశురామ్, మునివర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి ఉద్యోగులకు పేస్కేలు ఇవ్వాలి

గద్వాల రూరల్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు పేస్కేలు వర్తింపజేయాలని ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఉద్యోగులకు పేస్కేలు అమలు చేయాలని 70 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి సిఫారసు చేశారని తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



అలంపూర్ రూరల్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రసూనరాణి అన్నారు. బుధవారం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దగ్గు, జలుబు, జ్వరం విరోచనాలు, డెంగీ, టైఫాయిడ్, చికున్ గున్యా, తదితర జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడిగా ఉన్నప్పుడే భోజనం చేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులలో 108 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో బుధవారం గర్భిణులకు వైద్యాధికారిణి ప్రసూన రాణి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు సురక్షితమని పేర్కొన్నారు.

ఘనంగా రిజర్వేషన్ దినోత్సవం



ఎర్రవల్లి చౌరస్తాలో నివాళులర్పిస్తున్న నాయకులు



అలంపూర్ చౌరస్తాలో..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో బీఎస్పీ మండలాధ్యక్షుడు యువరాజ్ ఆధ్వర్యంలో బుధవారం రిజర్వేషన్ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ ఎంజీ కృష్ణ హాజరై రిజర్వేషన్ల పోరాట యోధుడు ఛత్రపతి సాహు మహారాజ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొల్హాపూర్ సంస్థాన రాజు ఛత్రపతి సాహూ మహారాజ్ తన రాజ్యంలో వెనకబడిన కులాల కోసం 50శాతం రిజర్వేషన్లు కల్పించాడన్నారు. సామాజిక న్యాయం పాటించిన మహనీయుడు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, ముని, ఉపేందర్, సవారన్న, విజయ్, మనోహర్, రాజు, రవి, మహేష్, తదితరులు ఉన్నారు.

అలంపూర్: సమాజానికి స్ఫూర్తి ప్రదాత ఛత్రపతి సాహు మహరాజ్ అని బీఎస్పీ మండల అధ్యక్షుడు ప్రభుదాస్ అన్నారు. బుధవారం అలంపూర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో రిజర్వేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి సాహు మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్ల కన్న ముందు 40 ఏళ్ల కిందట ఛత్రపతి సాహు మహరాజ్ వెనకబడిన కులాలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాజేశ్వరి, మానస, నాయకులు శివ, దస్తగిరి, నరేంద్ర, ముప్పారపు, శరత్, బాబు, స్వేరో, పవన్, నరేష్ తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

గద్వాల రూరల్: ఇటీవల వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేస్తూ సీఎం కేసీఆర్ జీఓ జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం వీఆర్ఏ సంఘం నాయకులతో కలిసి స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుభాన్, ఎంపీపీ విజయ్, జెడ్పీటీసీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, వీఆర్ఏలు

భజన సామగ్రిని అందజేసిన ఎమ్మెల్యే

గట్టు: మండలంలోని చాగదోన గ్రామానికి చెందిన భజన మండలి సభ్యులకు బుధవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి భజన సామగ్రిని అందజేశారు. గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భజన మండలి సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు తబలా, హార్మోనియంలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, చాగదోన గ్రామ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు తిమ్మప్ప మాతృమూర్తి మృతి బుధవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణ, నాయుడు, ఎంపీటీసీ తిమ్మప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

గట్టు: మండలంలోని ఇందువాసిలో మంగళవారం రాత్రి జిల్లా వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా చిన్న నర్సప్ప, యూత్ కమిటీ అధ్యక్షుడు నెక్కి తిమ్మప్పలను ఏన్నుకున్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు బల్గెర హనుమంతు, కోటేష్, వైడింగ్ రాములు, న్యాయవాది మధుసూదన్‌బాబు, గద్వాల రామాంజనేయులు, ఇందువాసి మేకలతిమ్మప్ప, నాగశంకర్, భాస్కర్, వీరేష్, రామాంజనేయులు, గుపద్‌నాయుడు, గట్టు మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు రామునాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

కొనసాగుతున్న మొహర్రం ఉత్సవాలు

అలంపూర్ రూరల్: పట్టణంలో మొహర్రం వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం ఐదో రోజు పీర్ల చావిడిలో ఏర్పాటు చేసిన పీర్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇందులో భాగంగా పెద్దదర్గా దగ్గర ఏర్పాటు చేసిన పెద్ద ఇమాంఖాసీం పీరు శింగవరం ఇమాంఖాసీం పీర్లు బుధవారం రాత్రి సవారీ చేశారు. డబ్బు వాయిద్యాల మధ్య యువకులు కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు.



పట్టణంలో ఏర్పాటు చేసిన పీరు

బోయలకు 'వాల్మీకి బంధు' ఇవ్వాలి

ఆత్మకూర్: వాల్మీకులు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని, వారికి వాల్మీకిబంధు ఇవ్వడంతో పాటు ఎస్టీ జాబితాలో చేర్చి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వాల్మీకి బోయ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆత్మకూర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును ఆమోదించి వాల్మీకులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చ చేయాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక జనాభా కలిగిన వాల్మీకులకు టికెట్లను కేటాయించాలని, వాల్మీకి ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు నిధులు సమకూర్చాలని కోరారు. ఎలాంటి కులవృత్తి లేని తమకు వాల్మీకిబంధును ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. హక్కుల సాధనకోసం వాల్మీకులు ఏకం కావాలని, ఎస్టీ జాబితాలో చేర్చే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సింధూజకు అందజేశారు. కార్యక్రమంలో మండ్ల విజయ్, కావలి వెంకటన్న, ఎస్టీడీ శ్రీను, కొత్తబోయ శేఖర్, సద్దల వెంకట్, రాజు, ఎల్లన్న, నరేందర్, కావలి రఘు, సూరి, పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ధరూరు: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జూరాల ప్రాజెక్టుకు భారీ ఎత్తున వరద నీరు వచ్చే అవకాశం ఉందని, నదీ పరివాహక ప్రాంత ప్రజలతో పాటు లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శివానందం గౌడ్ అన్నారు. బుధవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. వారం రోజులుగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండాయని గురువారం ఉదయం జూరాలకు వరద పోటెత్తె అవకాశం ఉందన్నారు. కృష్ణానది పరివాహక గ్రామాలైన నాగర్‌దొడ్డి, ఉప్పేరు, గార్లపాడు తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దని కోరారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ అశోక్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ స్తంభాలను తాకవద్దని, రానున్న రెండు రోజుల్లో భారీ కురుస్తాయని పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 90100 76222
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 90100 68317
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com